ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 29 బుధవారం 29-01-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

# వన్ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

## తెలంగాణకు భారీగా పెట్టుబడులు రాక

**దావోస్ ఒప్పందాలతో రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు**

**స్కిల్ వర్సిటీ కోసం సింగపూర్‌తో ఒప్పందం**

**పెట్టుబడులపై కొందరు వక్రభాష్యాలు**

**రాష్ట్ర అభివృద్ధిపై దుష్ప్రచారాలు చేస్తున్నారు**

**మంత్రులతో కలసి మీడియా సమావేశంలో సిఎం రేంవత్ రెడ్డి**



**హైదరాబాద్,జనవరి28:** తమ ప్రభుత్వం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దావోస్ సదస్సు ద్వారా దాదాపు రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. అయితే కొందరు దీనిని జీర్ణించుకోలేక వెకిలి వ్యాఖ్యలు చేస్తున్నారని సిఎం మండిపడ్డారు. సచివాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎం ర ఏవంత్ రెడ్డి, మంత్రులు మాట్లాడారు. ప్రభుత్వంపై కొందరు చేసిన దుష్ప్రచారం పటాపంచలు అయ్యింది. ప్రభుత్వంపై, రాష్ట్రంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులకు చాలామంది ముందుకు వచ్చారు. ఈ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచుతూ అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయని సీఎం వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది మా ప్రభుత్వం సాధించిన కీలక విజయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా కొందరు కుట్రలు చేశారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. దావోస్ పర్యటనతో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టేలా మన రాష్ట్రం ఆకర్షించగలిగిందని చెప్పుకొచ్చారు. ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. రాజకీయంగా విభేదించినా రాష్ట్ర అభివృద్ధి విషయంలో రాజకీయ వివాదాలకు వెళ్లొద్దని హితవు పలికారు.

## అవినీతిరహిత పాలన పేరుతో బురిడీ

**కేజ్రీవాల్ అద్దాల మేడలో నివాసం**

**ఎన్నికల ప్రచారంలో విరుచుకుపడ్డ రాహుల్**



**న్యూఢిల్లీ,జనవరి28:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో దిల్లీలోని ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. అధికారంలోని ఆమ్ ఆద్మీ పార్టీపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. అవినీతిరహిత పాలన పేరుతో బురిడీ కొట్టించారని, కేజ్రీవాల్ అద్దాల మేడలో నివాసం ఉంటున్నారని, ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్ విరుచుకుపడ్డారు. రాహుల్'కేజీవ్రాల్ తనకు తోచిన విషయాన్ని మాట్లాడుతూ ఉంటారు. మొదట్లో దిల్లీలో అవినీతి రహిత రాజకీయాలు చేస్తానని చెప్పారు. దేశ రాజధానిలో మార్పులు చూపిస్తానని అన్నారు. కానీ, పేదలు కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రం కనిపించకుండా పోతారు. దిల్లీలో హింస జరిగే సమయంలో మాయం అయ్యారు. ఆయనకు కొత్తలో చిన్న కారు మాత్రమే ఉండేది. కానీ, తర్వాత శీష్ మహల్‌లో (అద్దాల మేడ) నివసించారు' అంటూ దిల్లీలో ఏర్పాటు చేసిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్న రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు.

## నాటి సీఎం కేసీఆర్ ఎవరినీ పోల్చలేం : జగదీశ్‌రెడ్డి

**నల్లగొండ,జనవరి28:** రైతు పక్షాన నిలబడి వారి శ్రేయస్సు కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన నాటి సీఎం కేసీఆర్‌తో ఎవరినీ పోల్చలేమని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ కుక్క మూతి నేతలకు మేం భయపడం. తెలంగాణ రాష్ట్రం రైతాంగం మద్దతుతో ఏర్పడిందని జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలోని క్లాక్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన రైతు మహా ధర్నాలో ఆయన కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో కరెంట్ ధరల పెంపును ఒప్పుకోను అని చెప్పి నాడు కేసీఆర్ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతులే మద్దతుగా నిలిచారన్నారు. 'కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో' నినాదాలతో తెలంగాణ సాధించారని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చాక ప్రజల కోరిక మేరకు అధికారం చేపట్టారు.



## శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్

**తిరుమల,జనవరి28:** శ్రీవారిని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్ మంగళవారం దర్శించుకున్నారు. బుధవారం జీఎస్ఎల్వీ ఎఫ్-15 శాటిలైట్‌ని ప్రయోగించనున్న నేపథ్యంలో ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. నారాయణన్‌కు అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. వెంకన్నను దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం కొత్త మైలురాయిని చేరుకోబోతున్నట్లు ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. 1979లో శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో మొదటి ప్రయోగం నిర్వహించగా.. బుధవారం నిర్వహించే ప్రయోగం వందోదని ఇస్రో ఛైర్మన్ తెలిపారు. జీఎస్ఎల్వీ ఎఫ్-15 శాటిలైట్ అంతరిక్షంలోకి పంపడం ద్వారా నావిగేషన్‌ను సులభంగా వినియోగించుకునే అవకాశం లభిస్తుందని నారాయణన్ చెప్పారు. ఇప్పటివరకూ 433 విదేశీ ఉపగ్రహాలను శ్రీహరికోట నుంచి ప్రయోగించినట్లు ఆయన చెప్పుకొచ్చారు. రూ.4 వేల కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గగన్‌యాన్ ప్రయోగానికి ఈ లాంచ్ ప్యాడే ఉపయోగించనున్నట్లు నారాయణన్ తెలిపారు.

## హైదరాబాద్‌లో మరో రెండు ఐటి పార్కులు

**హైటెక్ సిటీ తరహాలో ఏర్పాటు చేసే లక్ష్యం**

**వందకోట్ల పెట్టుబడితో ముందుకొచ్చిన 'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ**

**ప్రతినిధులతో చర్చించిన ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్,జనవరి28:** నగర శివారుల్లో కొత్తగా రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. హైటెక్ సిటీ తరహాలోనే కొత్తగా మరో రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. హైదరాబాద్ లో రూ.100కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన 'డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో సచివాలయంలో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఐటీ రంగంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రముఖ కంపెనీలు ఇక్కడ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తున్నాయని తెలిపారు.వీటిని ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి? నగర శివారుల్లో ఏయే ప్రాంతాలు ఇందుకు అనుకూలంగా ఉన్నాయో సంబంధిత యంత్రాంగం అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఐటీ పార్కుల్లో పనిచేసే ఉద్యోగులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని, రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఎక్కడి నుంచైనా ఈ పార్కులకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ పార్కుల్లో కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సాఫ్ట్ వేర్ కంపెనీలకు అవకాశం కల్పిస్తామన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పరిశ్రమలకు భూకేటాయింపులపై ఇప్పటి వరకు ప్రత్యేక పాలసీ అంటూ ఏదీ లేదని, దీని వల్ల పారిశ్రామికవేత్తలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అందుకే ప్రత్యేక పాలసీ రూపొందిం చాలని నిర్ణయించామని, పెట్టుబడితో పాటు కల్పించే ఉద్యోగాల సంఖ్య ఆధారంగా భూమిని కేటాయిస్తా మని శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో 100 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన డ్యూ సాఫ్ట్ వేర్ కంపెనీని సంతోషంగా ఆహ్వానిస్తున్నామని, ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా సహకరిస్తామన్నారు. రాబోయే అయిదేళ్లలో ఈ సంస్థ 900 మందికి ఉపాధి అవకాశాలను కల్పించనుందని పేర్కొన్నారు.

## నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ

**జిల్లాలో వరి ఉత్పత్తిని పెంచేలా చేసిన కెసిఆర్**

**రైతుబంధు ఉంటే కెసిఆర్‌ను గుర్తుంచుకుంటారన్న కుళ్లు**

**రైతుభరోసా పేరుతో కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోంది**

**ఇచ్చిన హామీలపై ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాలి**

**నల్లగొండలో ఇదో విజయోత్సవ సభలా ఉంది**

**నల్లగొండ రైతు ధర్నాలో కెటిఆర్ విమర్శలు**



**నల్గొండ,జనవరి28:** ఆనాడు నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ అని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ ఏం చేశారని అసెంబ్లీలో ఓ మంత్రి అడిగారన్న ఆయన.. వరి ఉత్పత్తిలో జిల్లాను నెంబర్ వన్ చేశారని చెప్పారు. ఇక్కడికి గోదావరి జలాలలను తరలించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. నల్గొండ క్లాక్‌టవర్ కూడలిలో భారాస రైతు మహా ధర్నాలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. తొలుత నాగార్జున కళాశాల వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి కేటీఆర్ నివాళులర్పించారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ..' రైతు బంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ.73 వేల కోట్లు ఇచ్చింది. నల్గొండ బిడ్డలు జీవచ్ఛవంగా మారడానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని దుయ్యబట్టారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం అవుతుందని కేసీఆర్ ఎప్పుడో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతుబంధు నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు.రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరని, ఆ పథకాన్ని తీసుకొచ్చిన కేసీఆర్ పేరే నిలబడుతదనే భయం సీఎం రేవంత్ రెడ్డి లో ఉన్నదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అందుకే రైతుబంధు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఇప్పుడు స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల కోసం రేవంత్ మళ్లీ రైతుభరోసా నాటకం ఆడుతున్నాడని, ఎన్నికలు అయిపోంగనే రైతుబంధు మళ్లీ బందేనని ఆయన విమర్శించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను జనం నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అన్ని పంటలకు క్వింటల్‌కు రూ.500 బోనస్ ఇస్తమన్నడు. మరె ఎవరికన్నా బోనస్ పైసలు పడ్డయా..? ఇప్పుడు మాట మార్చి సన్నవడ్లు పండిస్తెనే బోనస్ ఇస్తం అంటున్నరు. ఇగ వ్యవసాయ మంత్రి అయితే సన్నవడ్లకు బోనస్ ఇచ్చుడు బాగుంది, రైతు భరోసా అక్కెరే లేదని రైతులే చెప్తున్నరు అంటున్నడు. ఇప్పుడు ఎన్నికలు ఉన్నయ్ కాబట్టి రైతుభరోసా ఇస్తం అని నాటకమాడుతున్నరు. ఈ నాటకాలను మీరు గమనించాలె. ఎన్నికలు అయిపోంగనే రైతు భరోసా కూడా బంద్లైతది' అని కేటీఆర్ హెచ్చరించారు.

## సూపర్ సిక్స్ పథకాలకు ఇక శుభం కార్డే

**డబ్బులుంటేనే పథకాలు అమలని బాబు సూక్తులు**

**చంద్రబాబు వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫైర్**

**అమరావతి,జనవరి28:**

కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలకు ఇక శుభం కార్డు పడ్డట్లే అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం ఇచ్చిన ప్రజెంటేషన్ ఇందుకు నిదర్శనమని అన్నారు. సూపర్ సిక్స్ సూపర్ ప్లాఫ్ అని ఎద్దేవా చేశారు. నీతి ఆయోగ్ రిపోర్ట్ ముందుపెట్టి, డబ్బులుంటేనే పథకాలని నీతి సూక్తులు చెప్పారని చంద్రబాబుపై షర్మిల మండిపడ్డారు. పథకాలు కావాలంటే ఆదాయం పెంచాలంటున్నారని.. మోకాలికి బోడి గుండుకు ముడిపెట్టినట్లుంది చంద్రబాబు తీరు అని విమర్శించారు. నమ్మి అధికారం ఇస్తే రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసం చేశారని ఆరోపించారు. 50 లక్షల మంది అన్నదాతలను వంచించారని.. 80 లక్షల మంది విద్యార్థులకు ద్రోహం చేశారని.. కోటిన్నర మంది మహిళలను మోసం చేశారని.. 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలకు ఆర్థిక వెసులుబాటు లేదని, గత వైసీపీ ప్రభుత్వ ఆర్థిక విధ్వంసమే కారణమని చంద్రబాబు చెప్పారని షర్మిల గుర్తుచేశారు. జగన్ ఆర్థిక ఘోరమే నిదర్శనమని చెప్పే బాబు గారు.. ఎన్నికల్లో హామీలు ఇచ్చే ముందు తెలియదా ఈ ఆర్థిక విధ్వంసం, ఘోరమని నిలదీశారు. 'సూపర్ సిక్స్' పథకాల రూపకల్పనలో కనపడలేదా రాష్ట్ర ఆర్థిక భారమని ప్రశ్నించారు. రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని చెప్పింది మీరే అని గుర్తుచేశారు. కూటమిని గెలిపిస్తే 100 రోజుల్లో గాడిన పెడతామన్నది మీరేనని.. తీరా ఓట్లు



పడ్డాక ఇచ్చిన హామీలపై మడతపేచీ పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని, అప్పులు పుట్టడం లేదని సాకులు వెతకడం మాని.. పథకాల అమలుపై దృష్టి పెట్టాలని ఏపీ కాంగ్రెస్ తరపున షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రంలో పెద్దన్న పాత్ర పోషించే మీరు.. రాష్ట్ర దీనస్థితిపై ప్రధాని మోదీని పట్టుబట్టాలన్నారు. పథకాలకు కావాల్సిన నిధులు ఇవ్వాలని అడగాలని.. నీతి ఆయోగ్ చెప్పినట్లుగా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక అరాచకంపై వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆదాయం ఏ కోటకు మళ్ళిందో తేల్చాలన్నారు.

# ఏడాది లోపు కాజీపేట కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తి చేస్తాం

**కాజీపేట ఆవరణలో నూతన బస్టాండ్ ఏర్పాటుకు**

**అధికారులతో కలిసి స్థల పరిశీలన చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**హన్మకొండ, జనవరి 28**

కాజీపేట ఆవరణలో నూతన బస్ స్టాండ్ నిర్మాణం కోసం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య,ఏడిఆర్ఎం గోపాల్ లతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య స్థలాన్ని పరిశీలించారు. ముందుగా అధికారులతో కలిసి మ్యాప్ ద్వారా స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఎన్నో సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పరిష్కరించు కుంటూ వస్తున్నామని తెలియజేశారు. కాజీపేట నూతన బస్టాండ్ ఏర్పాటు కోసం మంగళవారం అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించామని వెల్లడించారు. ఏడాదిలోపు కాజీపేట నూతన బస్టాండును ప్రారంభించపోతున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా కాజీపేట బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. విస్తృతమైన రైల్వే కనెక్షన్‌లలో కీలకమైన జంక్షన్ కాజీపేట అని పేర్కొన్నారు. బస్టాండు ఏర్పాటుతో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులకు సేవలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. పార్లమెంట్ లో కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది నాయకులు,ప్రజలు కాజీపేట బస్ స్టేషన్ నిర్మాణం కావాలని పోరాటాలు చేశారు,గతంలో నేను కూడా ధర్నాలు రాస్తారోకో చేసినమనిగుర్తు చేశారు.కాజీపేట బస్ స్టాండ్ ఏర్పాటు,కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు కోసం ఎంపీ ,మేయర్,జిల్లా కలెక్టర్,ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి రైల్వే అధికారులను కలవడం జరిగిందని,రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టితో ఈ రోజు రైల్వే అధికారులు మొదటి అడుగు వేశారని తెలిపారు.రానున్న అతికొద్ది రోజుల్లోనే రైల్వే బ్రిడ్జి నిర్మాణం కూడా పూర్తి అవుతుందని,తదనంతరం కాజీపేట బస్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు వస్తాయని రైల్వే అధికారులు సహకారాలు అందిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.గతంలో కాజీపేట బస్ స్టేషన్ పేరిట్ ఎందరో నాయకులు తమ సొంత లాభాలకు వాడుకున్నారని,నా కల బస్ స్టేషన్ నిర్మించడమని అన్నారు.రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాజీపేట నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని,త్వరలో కాజీపేట లో డిగ్రీ కళాశాల,మెరుగైన వైద్యం కోసం దవాఖాన ఏర్పాటు చేస్తామని తెలిపారు.రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న కుడి వైపున కానీ ఎడమ వైపున కానీ బస్ స్టాండ్ నిర్మాణానికి అనువైన స్థలాలను ఉన్నాయని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య రైల్వే అధికారు లు చూపించిన మ్యాప్ న పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.అనంతరం అధికారులతో మాట్లాడుతూ త్వరగా ఫైల్ తయారు చేయాలని అధికారు లకు సూచించారు.





# అపూర్వ సేవలకు ఆత్మీయ సన్మానం



**వేములవాడ, జనవరి 28**

వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఐదేళ్ల పదవీకాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న రామతీర్థపు మాధవి–రాజులను వేములవాడ ప్రెస్ క్లబ్ టీ.యు.డబ్ల్యూ.జే(ఐ.జే. యు) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం పట్టణంలోని ఎస్.ఆర్.ఆర్ హోటల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ దంపతులను గజమాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే(ఐజేయు) రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దండి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఐదేళ్లపాటు వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ గా పనిచేసిన రామతీర్థపు మాధవి రాజు పట్టణాన్ని పచ్చదనము, పరిశుభ్రత, భద్రత గల పట్టణంగా తీర్చిదిద్దడమే కాకుండా 110 కోట్ల రూపాయలతో పట్టణాన్ని ప్రగతి పథంలో నడిపించి విశేష సేవలు అందించారని కొనియాడారు. అనంతరం ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు రేగుల దేవేందర్, సీనియర్ జర్నలిస్టు గోగికార్ శ్రీనివాస్ లతో పాటు అధ్యక్ష, కార్యదర్శులు పుట్టపాక లక్ష్మణ్, నూగురి మహేష్ తదితరులు మాట్లాడుతూ కరోనా కష్టకాలం మొదలుకొని నేటి వరకు ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ, ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటూ వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకువెళ్ళడంలో చైర్ పర్సన్ మాధవి కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. తదనంతరం తాజా, మాజీ చైర్ పర్సన్ మాధవి మాట్లాడుతూ వేములవాడ అభివృద్ధిలో తమ పాత్ర ఎంత ఉందో జర్నలిస్టుల పాత్ర అంతే ఉందని, మీడియా ప్రతినిధులు అందించిన సలహాలు, సూచనలతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లేందుకు తమ వంతు కృషి చేశామని అన్నారు. వేములవాడ పట్టణ రూపురేఖలు మార్చేందుకు ఈ ఐదేళ్ల కాలం ఉపయోగపడిందని, అందరి సహకారంతో గడిచిన ఐదేళ్ల పాలన సంతృప్తినిచ్చిందని, రాబోయే రోజుల్లోనూ అందరి సహకారంతో పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

**ఎల్కతుర్తి, జనవరి 28**

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ కి పద్మశ్రీ అవార్డు ప్రకటించిన నేపథ్యంలో మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి ఘనంగా పాలాభిషేకం చేసిన నాయకులు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఈర రమేష్ మాట్లాడుతూ దళిత హక్కుల కోసమే ఆన్యాయం జరుగుతుందని ఉద్దేశంతో 1994 జూలై 7వ తేదీన ప్రకాశం జిల్లా ఇదుముడి గ్రామంలో 20 మంది యువకులతో ఏర్పడిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఒకవైపు జాతికి జరుగుతున్న అన్యాయం రావాల్సిన పొలాల కోసం పోరాటం చేస్తూనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు అండగా నిలిచింది కేవలం ఎమ్మార్పీఎస్ మాత్రమే అని అన్నారు ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎస్సీ వర్గీకరణ కోసం పుట్టగా అనేకమైనటువంటి సామాజిక ఉద్యమాల కోసం పోరాటం చేసింది. ఖమ్మం జిల్లాలో మధుర నియోజకవర్గంలో నసీమానే చిన్నారి గుండె జబ్బుతో సతమవుతున్న విషయాన్ని తెలుసుకున్న మందకృష్ణ మాదిగ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి గుండె జబ్బుతో బాధపడుతున్న పిల్లలను ఒక తాటిపైకి తెచ్చి ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డితో ట్యాంక్ బండ్ పై జరిగినటువంటి మహోన్నతమైనటువంటి ఉద్యమంలో గుండె జబ్బుతో బాధపడుతున్న పిల్లలకు ఎంత ఖర్చైనా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి అని జీవో తీసుకొచ్చేదాకా ఉద్యమం చేయగానేడు గుండె జబ్బుల కోసం పోరాడు చేయగా సబండ వర్గాలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందంటే ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన పథకమే ఆరోగ్యశ్రీ అది కేవలం ఎమ్మార్పీఎస్ పోరాటం ఫలితమే అని అన్నారు వాటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులు వితంతువులు వికలాంగులకు వారు పడుతున్నటువంటి అవస్థలను గ్రహించి వృద్ధులు వితంతులకు 4000 రూపాయలు వికలాంగులకు 6000 రూపాయలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలోనే పోరాటం చేయగా విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లో పింఛన్ విధానమలవుతుందంటే కేవలం ఎమ్మార్పీఎస్ చేసిన ఉద్యమమే అని పేర్కొన్నారు.ఫిబ్రవరి ఏడవ తేదీన జరగబోయేటువంటి వేల గొంతులు లక్షలాది డబ్బులు అని నినాదంతో వర్గీకరణ అమలు చేస్తే కృతజ్ఞతగా డప్పుల మోత మోగుతుందని లేనియెడల కాంగ్రెస్ ప్రభుత్వం పై చావు డబ్బుమవుతుందని అన్నారు ఈ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు బొంకూరి కార్తీక్ మాదిగ, కార్యదర్శి ఎల్తూరి సురేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మేకల రవి మాదిగ, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల చేరాలు మాదిగ, కార్మిక సంఘం మండల అధ్యక్షులు రేణిగుంట్ల సాంబయ్య మాదిగ, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్ మాదిగ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శనిగరం వెంకటేష్ మాదిగ, బిఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సాతురి శంకర్ మాదిగ, గోపాల్పూర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొయ్యడ రాజేందర్ మాదిగ, చిలుముల ప్రమోద్ మాదిగ, రమేష్ మాదిగ,భీమ్ యూత్ అధ్యక్షులు అల్లకొండ బాలస్వామి మాదిగ,మారపల్లి అనురుద్ మాదిగ, ఎల్తూరి వినయ్ మాదిగ ,సంద్ర పవన్ మాదిగ, మాటూరు శీనుమాదిగ,ఎర్రోళ్ల ప్రకాష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# మేరు సంఘం- 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎంపీ కడియం కావ్య

**హన్మకొండ, జనవరి 28**

మేరు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేరు సంఘం, వరంగల్ జిల్లా-2025 క్యాలెండర్ ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మేరు కులస్తుల సమస్యలు పరిష్కరించడంలో ముందు ఉంటానని,వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చుటకు సహాయపడతానని,మేరు కులస్తులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ పరంగా సహాయసహకారాలు అందిస్తానని, వారికి అండగా ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తాళ్ళ సంపత్ కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్, నాయకులు కర్నె రవీందర్, బోలకొండ రవితేజ, గూడూరు బాలాజీ, గూడూరు సతీష్ కుమార్, దోమకొండ శ్రీనివాస్, రామగిరి యాదగిరిస్వామి, రాయబారపు బిక్షపతి, వోడపల్లి వీరన్న, సోమ మధుకర్, కర్నె వాసుదేవ్,పోడిశెట్టి సుధాకర్, సోమ శివ కుమార్, అశోక్, కీర్తి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్ కొత్తగూడెం లో పశువైద్య శిబిరం

**చర్ల, జనవరి 28**



మంగళవారం చర్ల మండలం లోని ఆర్ కొత్తగూడెం గ్రామంలో మెగా పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయటం జరిగింది. ఈ పశువైద్య శిబిరం లో గ్రామ కార్యదర్శి శోభ రాణి పశువులు పెంపకం గురించి గేదెలలో ఉన్న గర్భకోశ వ్యాధులను నివారించి వాటి యొక్క పిండోత్పత్తిని ఎలా అభివృద్ధి పరచాలి గర్భకోస వ్యాధులు ఎలా నివారించాలి అని తెలియచేసారు. గ్రామాలలో ఉన్న నాటుకొడ్లు వ్యాధులకు గురిఅవుతున్న సందర్భంలో వాటికి కూడా మన దగ్గర మంచి మందులు వచ్చాయని కోళ్ల వ్యాధి నివారణకు మందులు తీసుకొని వెళ్లవలసినదిగా చెప్పారు .డాక్టర్ శ్రామిక చెప్పిన వ్యాధి నివారణ, సూచనలను రైతులందరూ శ్రద్ధతో వినడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ రైతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి భద్రాచలం డివిజన్ రైతు కాంగ్రెస్ అధ్యక్షులు ఇందల గోపాల బుచ్చిబాబు,మాజీ సర్పంచ్ తుర్రం రవికుమార్,గొల్ల రాజబాబు, సోమరాజు సున్నం గంగరాజు,కూరపాటి గంగరాజు, రామకృష్ణ,వేములవాడ కృష్ణ పాల్గొన్నారు .

# ఘనంగా కర్పూరి ఠాగూర్ శతజయంతి వేడుక

**మీవార్త కేలండర్ ఆవిష్కరణ**

**చర్ల, జనవరి 28**



భారతరత్న బీహార్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు కర్పూరి ఠాగూర్ శతజయంతి ఉత్సవాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తూముల సదానందం అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉపాధ్యక్షులు తూముల శ్రీనివాస్, కేటీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొమరవెల్లి రవీందర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కురిమిల్ల శంకర్, తోపాటు మహబూబాబాద్ లోపా వ్యవస్థాపక అధ్యక్షులు ఎలమందలకు కృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షులు లింగంపల్లి దయానంద జంపాల యాకయ్య, వెంకటేశ్వర్లు తో పాటు చర్ల మండల నాయకులు తోటపల్లి మాధవరావు, గోరింట్ల వెంకటేశ్వరరావు, తోటపల్లి రమణ, అయినవల్లి శ్రీను, నేదునూరు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపినా
## అప్స్ వ్యవస్థాపకులు కొల్లూరి డా. చిన్నా

**వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమానికి**

**ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ కు ఆహ్వానం**



**పెడన, జనవరి 28**

ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి జీవో విడుదల చేస్తూ శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమాన్ని జనవరి 31వ తేదీన పెనుగొండ గ్రామం శ్రీ వాసవి క్షేత్రంలో నిర్వహిస్తుండడం ఆర్య వైశ్యులు ఎంతో హర్షించదగ్గ విషయం. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు,పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా కృతజ్ఞతలు తెలియజేశారు.


**ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ కు ఆహ్వానం**

జనవరి 31 శుక్రవారం శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని స్థానిక శ్రీ వాసవి క్షేత్రమునందు పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకములు, శ్రీ వాసవి హోమం ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ని పట్టణ ఆర్యవైశ్య సంస్థలకు చెందిన పలువురు ప్రతినిధులు ఆహ్వానించినట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా తెలియజేశారు. పెడన పట్టణ, మండల, పరిసర ప్రాంత ఆర్యవైశ్యులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డా. కొల్లూరి విజ్ఞప్తి చేశారు.

## ద్విచక్ర వాహనము నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ దరించాలి

**ఆన్లైన్ మోసాలపై అవగాహన కల్పించిన ఎస్సై ఏ. ప్రవీణ్ కుమార్**

**ఎల్కతుర్తి, జనవరి 28**






ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండు కుదలి వద్ద ద్విచక్ర వాహనదారులకు, ప్రజల కు హెల్మెట్ వాడకం,ఆన్లైన్ మోసాలపై అవగాహన కల్పించిన ఎస్సై ఏ. ప్రవీణ్ కుమార్. అనంతరం అయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో మీకు లాటరీ తగిలిందని రకరకాల గిఫ్టులు వచ్చాయని ఆన్లైన్ మోసాలు చేసేవాళ్లు కాల్ చేసి 500 రూపాయలు పంపిస్తే 5000 రూపాయలు వస్తాయని చెప్తారు. ఈజీ మని జోలికి పోవద్దని కష్టపడి డబ్బు సంపాదించుకోవలని ఆన్లైన్ గేమ్స్ జోలికి పోవద్దని సైబర్ మోసాలు ఎక్కువ జరుగుతున్నాయి.కాబట్టి ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఒకవేళ ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే 1930 కు కాల్ చేస్తే డబ్బులు ఓల్డ్ లో పెడతారు. స్థానిక పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చిన తర్వాత మీ డబ్బులు మీకు వస్తాయి. కాబట్టి ఆత్యాశకు పోకుండా ఏదో ఒక పని చేసి డబ్బులు సంపాదించుకోండని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది బక్కయ్య, జ్యోతి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# మానుకోట సర్వ వనరులు ఓం నారాయణార్పణం..

**వ్యవస్తీకృతంగా నేరంగా మారిన ఓం నారాయణ భూదోపిడీ..**

**గ్రామకంతా భూముల లెక్కలుమాయం వెనుక బడాగద్దలు..**

**గ్రామకంఠ భూముల్లో బుల్డర్ల తిష్ట..**





**తొలి సమయం ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్ జనవరి 29:**
నిత్యం బహుళ జాతి కంపెనీల, అంబాని అదానీల ఆర్థిక నేరాలు. వనరులదోపిడీలను ఇతివృత్తంగా, ప్రభుత్వాలపై దుమ్మెత్తి పోయడం చాలా కాలంగా కమ్యూనిస్తులకు ఆనవాయితి ఈమధ్య కాలం లో కాంగ్రెస్ కూడా అదే నినాదాన్ని ఎత్తుకుంది దాంతో పాటుగా ప్రాంతీయ పార్టీ టిఆర్ఎస్ కూడా అటు ఇటు కాకుండా మద్యే మార్గంగా అదే బాటలో ఉన్నట్లుగా తెలుస్తుంది. మానుకోటలో గత 40 సంవత్సరాలనుండి మానుకోట నడి బొడ్డున కోట్ల విలువ జేసే ప్రభుత్వ భూమి 107 సర్వే నంబర్ లోని కోట్ల విలువ చేసే భూముల్లో వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసుకొని లక్షల ప్రభుత్వ అదాయాన్ని గండి కొడుతున్నాడు కిరాయి పేరున లక్షలు వసూలు చేస్తున్నాడు సమస్త వ్యవస్థలు, పార్టీలను కోల్డ్ మానేజ్ చేస్తున్నాడని గత కొద్దికాలంగా ధర్నాలు, మెమో రండాలు, వినతి పత్రాలు రెవిన్యూ అధికారులకు ఇవ్వడం మానుకోట లో సర్వత్రా ఆసక్తి కరమైన ఓపెన్ సీక్రెట్.. గ్రామం కంట భూముల లెక్కలు మాయం కావడం వెనుక కూడా బడాభూ గద్దలు ఉన్నట్లు కూడా తెలుస్తోంది..మౌలికంగా గుడిసె పోరాటాల పేరున ప్రభుత్వాల పై భూపోరాటాలు చేస్తున్న ఉభయ కమ్యూనిస్టులుగాని. అదే గుడిసె పోరాటాల పేరున కాంగ్రెస్ బిఆర్ ఎస్ లు కూడా ప్రభుత్వ భూముల్లో పేదోళ్ల పై ప్రేమతో గుడిసె పోరాటాల పేరున కాలనీలు ఏర్పాటు చేశారు. సుందరయ్య కాలనీ, కేటీ ఆర్ కాలనీ జ్యోతి బసుకాలనీ, రాజీవ్ కాలనీ రెడ్యానాయక్ కాలనీ కవిత కాలనీ శ్రీరామ్ భద్రయ్య కాలనీలు ఏర్పడ్డాయి అయితే కమ్యూనిస్ట్ లకే చెల్లు బాటు అయ్యే గుడిసె పోరాటలు అన్ని పార్టీలకు శరా మామూలు అయ్యాయి..పోరాటం అనే పదం అన్ని పార్టీలకు సొంతం అయ్యింది. మౌలిక బేధం లేకుండా మూడు పార్టీలది అదే తంతుగా పేదోళ్ల గుడిసెల పోరాటంగా వింటున్నాం..అయితే పేదోళ్ల గుడిసె పోరాటాల తో పాటు బడా బాబుల ఆర్థిక నేరాలు, కోట్ల విలువ జేసే అక్రమ కబ్జా భూముల పై కూడ మాట్లాడక పోవడం వలన ప్రజల్లో పలు అనుమానాలకు తావు లేక పోలేదు అనే టాక్ నడుస్తోంది. పేదోళ్లను ప్రేమించే ఉభయ కమ్యూనిస్టులకు, కాంగ్రెస్ బిఆర్ ఎస్ పార్టీలకు మౌలిక బేధం ఉండాలని, అదిలేకుంటే ప్రజలకు దిక్కు ఎవ్వరు అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి.

**ఓం నారాయణ అక్రమ భూమి పైకనీసం బీజేపీ స్టాండ్..**
ఇటీవల వల పార్లమెంట్ ఎన్నికల్లో లక్షా 50వేల ఓటు బ్యాంక్ ను ప్రోది చేసుకున్న బీజేపీ కనీసం ఓం నారాయణ వ్యవస్తీకృత భూ ఆర్థిక నేరల పై మాట్లాడాలి కదా! గుంట జాగ ఇప్పించడానికి పేదోళ్ల తరుపున పోరాటం చేసే ఉభయ కమ్యూనిస్తులు, పేదోళ్ల పేరున ప్రభుత్వభూముల్లో గుడిసె పోరాటలు చేసిన కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు. లక్షా30వేల ఓటు బ్యాంకు కలిగి ఉన్న బీజేపీ కూడ ఓం హరి ఓం పై మాట్లాడక పోవడం పై.. ఓం నారాయణ ఆర్థికరాచకాల పై సర్వత్రా జ్యోష్ నడుస్తోంది.

ఓం నారాయణ అక్రమ కబ్జా భూముల్లోని వాగులు,గ్రామ కంఠా భూములు, షికాల్లో నింపే మట్టి మాఫియా,బినామి ట్రాక్టర్ లు జేసీబీ ఎవరివి!అనేది నిగ్గు తేల్చాల్సిన అధికారుల విధివిధానాలపై పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమ నిర్మానాలకు ఉపయోగించే ఇసుక మొత్తం గా ప్రకృతి వనరులు సర్వస్వం ఓం నారాయణార్పణం. అందరిబంధువు ఓం నారాయణ అవినీతి బాగోతం,క్విడ్ ప్రోకో కు ఒక ఉదాహరణగా నడుస్తోంది..

# కేంద్రమంత్రి బండి సంజయ్ ఖబర్దార్

**బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం**

**నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్**



**తొలి సమయం నర్సంపేట జనవరి 29:**
భారత దేశ మొదటి మహిళా ప్రధాని శ్రీమతి ఇందిరమ్మ గారిపై మరియు తెలంగాణ ప్రజా యుద్ధనౌక గద్దర్ గారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఖబర్దార్, అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్ అన్నారు. నర్సంపేట పట్టణ కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ప్రజా యుద్ధ నౌక గద్దర్ పైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గౌరవ నర్సంపేట నియోజకవర్గ శాసన సభ్యులు పెద్దలు శ్రీ దొంతి మాధవరెడ్డి గారి ఆదేశాల మేరకు మరియు తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి గారి పిలుపు మేరకు నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్ పటేల్ గారితో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టి బొమ్మ దగ్ధం చేయడం జరిగింది.ఈ సందర్బంగా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్ మాట్లాడుతూ దేశ మొట్టమొదటి మహిళ ప్రధానమంత్రి ఇందిర గాంధీ గారిపై మరియు తన గానంతో తెలంగాణ ఉద్యమాన్ని ఉత్తేజపరిచిన ప్రజా యుద్ధనౌక గద్దర్ ని అమిత్ షా చెప్పులు మోసే బండి సంజయ్ విమర్శించడం హాస్యాస్పదంగా బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరతుగా యావత్ తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని అన్నారు లేనిపక్షంలో బండి సంజయ్ ని తెలంగాణ ప్రజానికం క్షమించదని కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ ఇప్పటికైనా తన తప్పును తెలుసుకొని క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో బండి సంజయ్ నీ తెలంగాణ రాష్ట్రంలో తిరగకుండా యువజన కాంగ్రెస్ నాయకులు ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు, ఉందని ఇప్పటికైనా కేంద్రం స్పందించి బండి సంజయ్ నీ క్యాబినెట్ నుండి బర్తరఫ్ చేసి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నుండి ప్రతిపాదించిన ప్రజా యుద్ధనౌక గద్దర్ గారికి పద్మశ్రీ అవార్డును ప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్, వరంగల్ జిల్లా యూత్ ఉపాధ్యక్షులు రూపిక శ్రావణ్ కుమార్, వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొదిల్ల నరేష్, నర్సంపేట పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్కే షఫీక్, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొంత రంజిత్, ఖానాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలకందుల రాజు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ములుకల మనీష్, కిసరి అజయ్, నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి పల్స ప్రశాంత్ గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు కోరే రాజేష్, మైదం రాకేష్, మంద నరేష్, చిట్టి ప్రశాంత్, అల్లి అనిల్, గద్ద అఖిల్, మేడి రంజిత్, భూక్యా జీవన్, మంద విజయ్, కొత్తగట్టు ప్రశాంత్, జెట్టి శ్రావణ్, జెల్లే బాలకృష్ణ, సౌరపు సాంబరాజు,కోలుగురి కర్ణాకర్, దేశి సాయి పటేల్, మచ్చకంటి మనోజ్ కుమార్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరి కుంట్ల గ్రామంలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన బట్టు నాయక్



**తొలి సమయం దంతాలపల్లి మండలం జనవరి 28**
దంతాలపల్లి మండలం కుమ్మరి కుంట్ల గ్రామంలో ఎంజిఎన్ఆర్ఈజీఎస్ కార్యక్రమం క్రింద సిసి రోడ్ పనులు తొర్రూర్ ఏఎంసి వైస్ చైర్మన్ దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్ ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ కొమ్ము వాసు. జిల్లా నాయకులు. కొమ్మినేని రవిందర్, మండల యూత్ సంపెట సురేష్ గౌడ్, మండల నాయకులు తండా రాములు, మాజీ ఎంపిటిసి యాకన్న, ఎస్.కె జానీపాషా, గిర్వణి, వెంకట్ నారాయణ గౌడ్, గణగాని రమేష్, నరుకుటీ మానోజ్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఏరుకొండ యాకన్న, మురికి అనిల్, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది చిల్లర రాజకీయాలు మానుకో

**-పదేళ్ల పాలనలో ఎన్ని ఇండ్లు కట్టిచావు**

**-పీసీసీ సభ్యులు పెండెం రామానంద్**

**తొలి సమయం నర్సంపేట జనవరి 28:**



పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో పేదలకు ప్రజలకు ఎన్ని ఇండ్లు కట్టించావు చెప్పాలని, ఇకనైనా బుద్ధి తెచ్చుకొని చిల్లర రాజకీయ మానుకో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్ని తెలంగాణ రాష్ట్ర పీసీసీ సభ్యులు పెండెం రామానంద్ అన్నారు. మంగళవారం నాడు పత్రిక ప్రకటనలో టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కొక్క నీరుపేద కుటుంబానికి రూపాయలు ఐదు లక్షల రూపాయలతో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని మాయ మాటలతో గద్దెనెక్కి పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నర్సంపేట నియోజకవర్గంలో ఎన్ని ఇండ్లు కట్టించావో చెప్పాలన్నారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గతంలో మేము ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గౌరవ నర్సంపేట నియోజకవర్గ శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డి గారి సహకారంలో ఇండ్ల నిర్మాణాలకు పట్టాలు అందించి ఇండ్లు లేని పేద ప్రజలకు మేలు చేస్తున్నామని అన్నారు, గతంలో నువ్వు ఇచ్చిన హామీలు ఎంత వరకు నెరవేర్చావో చెప్పాలన్నారు, గిర్నిబావి నుంచి నర్సంపేటకు ఇండస్టియల్ కారిడార్ తీసుకువస్తాను అని వ్యాపారులతో పాలాభిషేకం చేసుకున్న సుదర్శన్ రెడ్డి ఏది మరీ ఇండస్ట్రీయల్ కారిడార్. మిర్చి పరిశోధన కేంద్రం తీసుకువస్తున్నా అన్నావు ఎక్కడ నీ మిర్చి పరిశోధన కేంద్రం, నర్సంపేటను ఇరిగేషన్ సర్క్యూట్ చేస్తా అన్నావు కదా ఏమైందని ప్రశ్నించారు, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో హామీలు ఉన్నాయని, ఇచ్చిన హామీలు మర్చిపోయి తుపాకి రాముడి మాటలు ఇలాగే మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరిచారు కాంగ్రెస్ ప్రభుత్వంపై మా నాయకుడు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గారిపై అవాకులు చెవాకులు మాట్లాడితే సహించేది లేదన్నారు. నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని గ్రామాల్లో ప్రజలు నుంచి విశేష స్పందన లభిస్తూ సభలు చాలా చక్కగా ప్రశాంతతమైన వాతావరణంలో జరుగుతున్నాయని గత బీఆర్ఎస్ పాలకుల తప్పిదాలతోనే ప్రజలకు ఇబ్బందులుపడ్డారన్న విషయాన్ని మర్చిపోవద్దని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఇక నుంచి మా నాయకుడు గురించి, కాంగ్రెస్ ప్రభుత్వం గురించి తప్పుడు మాట మాట్లాడిన నీకు ప్రజలు చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## టీచర్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ సేవల అభినందనీయం

**దాట్ల ప్రైమరీ స్కూలు హెడ్మాస్టర్ షేక్ బాషా**




**తొలి సమయం తొర్రూరు జనవరి 28**
ఈరోజు లైన్స్ క్లబ్ టీచర్స్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు సిహెచ్ సురేష్ మానస ఆర్థిక సహాయకారంతో దంతాలపల్లి మండలంలోని దాట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టై బెల్టు ఐడి కార్డ్స్ మరియు పనులు పంపిణీ ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న దాట్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ బాషా మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో బలహీన వర్గాల విద్యార్థులు విద్యాభ్యసిస్తారని టీచర్స్ క్లబ్ వారు చేయుట అందించడం అభినందనీయం అన్నారు అధ్యక్షులు చింతల సురేష్ బెల్టు ఐడి కార్డ్స్ ఇంగ్లీష్ సబ్జెక్టుకు సంబంధించిన మెటీరియల్స్ పంపిణీ చేశారు. రానున్న రోజులలో ప్రభుత్వ పాఠశాలలకు లకు విద్యార్థులను పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు కచ్చితంగా తీసుకోవాలని సూచించారు టీచర్స్ క్లబ్ తరఫున స్కూలుకు బెంచీలు టైలు ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్న టీచర్స్ క్లబ్ అధ్యక్షుడు సురేష్ కు అభినందనీయం మరియు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వెలుగే సురేష్ పెద్ద వెంకన్న సూరం ఉపేందర్ రెడ్డి క్లబ్ పూర్వ అధ్యక్షుడు రాయిపల్లి యాకయ్య ప్రతినిధులు చింతరామయ్య తోట రమేష్ ఇల్లందుల శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయులు రవీందర్ అనిత అపర్ణ పాషా స్కావెంజర్ ఉమా పాల్గొన్నారు.

## కార్పోరేటర్లు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

**హైదరాబాద్,జనవరి28:** ఇది ఎలక్షన్ ఇయర్.. అభివృద్ధిపై కార్పొరేటర్లు దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. గొడవలు చేసేందుకు కౌన్సిల్ వేదిక కాదని చెప్పారు. మళ్లీ కార్పొరేటర్‌గా తాను పోటీ చేయనని అన్నారు. మళ్లీ మేయర్ అయ్యే ఆలోచన తనకు లేదని తెలిపారు. మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ప్రతిపక్షాలకు హక్కు ఉందని విజయలక్ష్మి అన్నారు. అవిశ్వాసానికి స్వాగతిస్తున్నానని చెప్పారు. అవిశ్వాసానికి ఎంతమంది కావాలో కూడా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు తెలియదని అన్నారు. ఫిబ్రవరి 11వ తేదీ వరకు తామే మేయర్, డిప్యూటీ మేయర్ అని స్పష్టం చేశారు.

# హుస్సేన్‌సాగర్ ప్రమాద ఘటనలో ఒకరి మృతి

## గల్లంతైన యువకుడి కోసం విస్తృతంగా గాలింపు



**హైదరాబాద్,జనవరి28:** హుస్సేన్‌సాగర్ అగ్నిప్రమాద ఘటనలో ఒకరు మృతి చెందారు. రెండు రోజుల క్రితం భారతమాతకు హారతి కార్యక్రమంలో అగ్నిప్రమాదం జరుగగా బోటు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గణపతి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించారు. అయితే 80 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతూ గణపతి మంగళవారం మృతిచెందాడు. మృతుడు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అలాగే బోటు ప్రమాదం సమయంలో గల్లంతైన యువకుడు అజయ్ కోసం గాలింపు కొనసాగుతోంది. రెండో రోజు హుస్సేన్‌సాగర్‌లో రెస్క్యూ బృందాలు గాలిస్తున్నాయి.గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న భారత మాతకు మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. అదే సమయంలో హుస్సేన్సాగర్‌లో రెండు బోట్లు ఉంచి బోట్లలో నుంచి టపాసులు పేల్చాలని నిర్వాహకులు ప్లాన్ చేశారు. అయితే టపాసులు పేలుస్తున్న సమయం లో అపశృతి చోటు చేసుకుంది. టపాసులు దిశ మార్చుకుని నిల్వ ఉంచిన టపాసులపై పడటంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో అవి పేలాయి. దీంతో రెండు బోట్లు దగ్ధమయ్యాయి. అదే సమయంలో బోట్లో ఉన్న వారంతా తమ ప్రాణాలను రక్షించుకోడానికి కిందకు దూకారు. అయితే టపాసులు పెద్ద ఎత్తున పేలడంతో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సమయంలో బోట్లలోనే ఉన్న గణపతి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గణపతి క్రాకర్స్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. క్రాకర్స్ పేలుస్తున్న సమయంలోనే ప్రమాదం జరగడంతో గణపతికి 80 శాతం వరకు కాలిన గాయాలయ్యాయి. వెంటనే యశోదా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గణపతి మరణించాడు. ఇదే ప్రమాదంలో బోటు ఆపరేట్ చేస్తున్న మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వారు ప్రస్తుతం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అయితే ఈ బోటులో అజయ్ అనే యువకుడితో పాటు మరో ఇద్దరు స్నేహితులు ఉన్నారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ప్రాణాలను దక్కించుకునేందకు అజయ్‌తో పాటు ఇద్దరు స్నేహితులు హుస్సేన్ సాగర్‌లో దూకారు. అయితే ఇద్దరు స్నేహితులు క్షేమంగా బయటకు రాగా.. అజయ్ మాత్రం గల్లంతయ్యాడు. రెండు రోజులుగా అజయ్ కోసం రెస్క్యూ టీం గాలింపు చర్యలు కొనసాగిస్తోంది. అజయ్ కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేసే వరకు కూడా అతడు అదృశ్యమైనట్లు ఎవరూ గుర్తించలేదు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు అజయ్ కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగించారు. తిరిగి ఈరోజు తెల్లవారుజాము నుంచి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ప్రాణాలను కాపాడుకునే సమయంలో నీళ్లలో దూకిన వీరంతా లైఫ్ జాకెట్లు ధరించలేదని తెలుస్తోంది. అజయ్ ఆచూకి కనుగోనాలంటూ తల్లిదండ్రులు హుస్సేన్‌సాగర్ ఒడ్డునే కూర్చుని రోదిస్తున్న తీరు అందరినీ కంటతడిపెట్టిస్తోంది.

# అమీన్‌పూర్‌లో రంగంలోకి బుల్డోజర్లు

## ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు



**సంగారెడ్డి జిల్లా,జనవరి28:** హైడ్రా మరోసారి పంజా విసిరింది. అమీన్ పూర్‌లో హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా అక్రమ నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే హైడ్రా స్పందిస్తూ... వాటిని కూల్చివేసే పనిలో పడుతోంది. ఆక్రమణదారుల వెన్నులో వణుకుపుట్టేలా చేస్తోంది హైడ్రా. తాజాగా అమీన్ పూర్‌లో మరోసారి కూల్చివేతలు చేపట్టింది హైడ్రా. అమీన్ పూర్ పద్మావతి లేఅవుట్‌లో అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను మంగళవారం ఉదయం హైడ్రా అధికారులు తొలగించేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా కూల్చివేసింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన ప్రహారీ గోడను గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే తిరిగి మరోసారి అక్కడ ఫెన్సింగ్‌ను నిర్మించారు. దీనిపై ఐలాపూర్ రాజగోపాల్ నగర్, బందంకొమ్ము ప్రాంతాల్లో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మరోసారి ఫెన్సింగ్‌ను కూల్చివేశారు. అమీన్ పూర్ చెరువు కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అక్రమాలపై వచ్చిన పలు ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అధికారులు విచారణ చేపట్టారు. ఆక్రమణ జరిగినట్లు తేలడంతో కూల్చివేతకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. దీంతో వెంటనే హైడ్రా బుల్డోజర్లు అక్కడకు చేరకుని కూల్చివేతలు జరిపాయి. అమీన్ పూర్ పెద్ద చెరువుకు అనుకుని ఉన్న పద్మావతి నగర్ లేఅవుట్ ఆక్రమణకు గురైంది. 193, 194, 323 సర్వే నెంబర్లో 24 ఎకరాల్లో పద్మావతి లే అవుట్ విస్తరించి ఉంది. రాజకీయ పలుకుబడితో లే అవుట్‌ను కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు కబ్జా దారులు. ఏపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 2006 నుంచి ఈ అంశంపై బాధితులు పోరాడుతున్నారు. ఏళ్లుగా స్థానికంగా ఎవరు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. మొత్తం 294 ప్లాట్స్‌తో పద్మావతి నగర్ లే అవుట్ ఏర్పాటు చేశారు. గత నాలుగు నెలల క్రితం మొదటగా హైడ్రాను బాధితులు ఆశ్రయించారు. సర్వే చేసి మూడు నెలల క్రితం చుట్టూ నిర్మించిన గోడను హైడ్రా కూల్చివేసింది. అయితే హైడ్రా కూల్చివేతల తరువాత కొద్ది రోజులకే ఐరన్ ఫెన్సింగ్‌కు కబ్జా దారులు వేశారు. దీనిపై మరోసారి హైడ్రా ప్రజావాణిలో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. గతంలో కూడా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అమీన్‌పుర్‌లో అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా.. వాటిని కూల్చివేసింది. వందనపురి కాలనీ సర్వేనెంబర్ 848లో రోడ్డున ఆక్రమించి నిర్మించిన ఇళ్లను హైడ్రా కూల్చివేసింది. ఇళ్లు నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో వెంటనే స్పందించిన హైడ్రా... అక్కడకు చేరుకుని ఇంటిని ప్రొక్లైనర్ల సహాయంతో నేటమట్టం చేసింది. భారీ బందోబస్తు నడుమ హైడ్రా కూల్చివేతలు చేసింది. హైడ్రా కూల్చివేతలపై వందనపురి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలంగా అక్రమ ఇళ్ల నిర్మాణంపై పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధకారులు ఎవరూ పట్టించుకోలేదని.. చివరకు హైడ్రాకు ఫిర్యాదు చేసిన రోజుల వ్యవధిల్లోనే అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేసిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# వాతావరణంలో మార్పులు

**సంగారెడ్డి జిల్లా,జనవరి28:** హైదరాబాద్‌లో సగటు ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల సెల్సియస్ పరిధిలో ఉంటాయి. అయితే, ఇటీవల జనవరి మధ్యకాలం నుంచి వీటిలో గణనీయమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు, జనవరిలో ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయాయి. ఏప్రిల్ నాటికి ఉష్ణోగ్రత 36-34 డిగ్రీల మధ్యకు చేరుకుంటుందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

గడిచిన 5 సంవత్సరాలతో పోలిస్తే ఫిబ్రవరిలో వచ్చిన వాతావరణ మార్పులు చాలా క్లిష్టంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. జనవరిలోనే హైదరాబాద్ చల్లగా ఉంటుంది. ప్రతి ఏడాది జనవరిలో సగటున ఉష్ణోగ్రతలు 15.6 నుండి 28.5 వరకు నమోదు అవుతాయి. 2022లో జనవరిలో 12లో సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. 2020 లో 11 డిగ్రీల ఉష్ణోగ్రతలు కూడా నమోదయ్యాయి. ఒక 2015 జనవరిలో మాత్రం 34 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సంవత్సరం వాతావరణ మార్పులు ప్రకృతిపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని తెలుస్తోంది. ముఖ్యంగా, హైదరాబాదులో విపరీతమైన వేడిగాలులు, వర్షాలు కనిపించవచ్చు. వాతావరణ మార్పులతో పర్యావరణం, పై నా ప్రతికూల ప్రభావం పడనుంది. .పర్యావరణ నిపుణులు గమనించిన విధంగా, క్లైమేట్ మార్పుల వల్ల హైదరాబాద్ వంటి నగరాల్లో కాలుష్యం అధికమవుతోంది. ఇది ప్రజలలో శ్వాస సంబంధిత వ్యాధులు ఎక్కువ అవ్వడానికి కారణమవుతోంది. కాగా ఫిబ్రవరి 15 వరకు వాతావరణంలో భిన్న పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ సంచాలకులు నాగరత్నమ్మ తెలిపారు. ఒక్కొక్కప్పుడు చల్లగాలులు, మరొక్కప్పుడు వేడిగాలులు వీస్తాయన్నారామె. ఇక ఫిబ్రవరి 15 తర్వాత వేడి తీవ్రత పెరుగుతుందని, నగర వాసులు అప్రమత్తంగా ఉండాలని ఆమె హెచ్చరించారు.

# ఏకో ఫ్రెండ్లీ పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

## 150 ఎకరాల్లో సుమారు 25వేల జాతులకు చెందిన మొక్కలు



**హైదరాబాద్,జనవరి28:** శంకర్ పల్లి మండలం, ప్రొద్దుటూరులో ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్రెండ్లీ పార్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు నేతలు, ముఖ్య అధికారులు పాల్గొన్నారు. ప్రకృతి ప్రేమికుల కోసం నగర శివార్లలో నిర్మించిన అతిపెద్ద ఎకో ఫ్రెండ్లీ 'ఎక్స్ పీరియం' పార్క్‌ను ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయిలో రామ్‌దేవ్‌రావు 150 ఎకరాలలో ఏర్పాటు చేసిన పార్కులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 25 వేల జాతులకు సంబంధించిన మొక్కలు ఉన్నాయి. అర్జెంటీనా, ఉరుగ్వే, మెక్సికో, సౌత్ అమెరికా, స్పెయిన్, ఇటలీ, న్యూగినియా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల నుంచి అరుదైన మొక్కలు, చెట్లు, రకరకాల స్టోన్స్, అందమైన శిలలు సేకరించి గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. దీని కోసం సుమారు రూ. 150 కోట్లు ఖర్చు చేశారు. ఒక్కో శిల్పానికి రూ. 5 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఖర్చు చేశారు. 1,500 మంది కూర్చునేలా ఇండియాలోనే అతిపెద్ద హంపీ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. 30 అడుగుల ఎత్తులో 20 స్టెయిన్ లెస్ స్టీల్ శిల్పాలు ఏర్పాటు చేసి వాటిని ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రూ. 50 కోట్లతో 12 ఎకరాలలో మ్యాన్‌మేడ్ బీచ్ ఏర్పాటు చేశారు. 40 గదులు, 20 కాటేజీలతో సుందరమైన సహజ రిసార్టు ద్వీపంగా తీర్చిదిద్దారు. పీవెడ్డింగ్, పోస్టు వెడ్డింగ్, ఫొటో షూట్‌లకు ఎక్స్‌పీరియంను రామ్‌దేవ్‌రావు ఎంతో శ్రమకోర్చి ఏర్పాటు చేశారు. దేశానికి గర్వకారణంగా, రాష్ట్ర ప్రతిష్టకు చిహ్నంగా, హైదరాబాద్‌కు ఐకానిక్‌గా ఎక్స్‌పీరియం ఉంటుందన్నారు.

## మైనర్ బాలికలపై నలుగురు

# యువకులు అత్యాచారం

**హైదరాబాద్,జనవరి28:** 14 ఏళ్ల మైనర్ లంబాడా అమ్మాయిపై నలుగురు యువకులు అత్యాచారం చేశారు. ఈ ఘటన రెండు సంవత్సరాల క్రితం చత్రినాక వద్ద చోటు చేసుకుంది. నిందితులు, అమ్మాయిని మాయమాటలు చెప్పి ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు మద్యం తాగించేందుకు యత్నించారు. ఆమె నిరాకరించగా, నిందితులు ఆమెను లైంగికంగా వేధించారు. ఒకరు ఆమె పొట్టపై తన్నడంతో, ఆమె అచేతనంగా పడిపోయింది. కొన్ని గంటల తర్వాత, ఆమె స్పృహ లోకి వచ్చింది. తన బట్టలు చిరిగిపోయి ఉన్నాయని, శరీరంలో నొప్పిగా అనిపించిందని తెలిపింది. ఆపై, అక్కడి నుంచి బయటకు వచ్చి పరుగెత్తి.. తల్లిదండ్రులకు జరిగిన విషయం వివరించింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులపై సామూహిక అత్యాచారం, లైంగిక వేధింపు కేసు నమోదైంది. న్యాయ విచారణలో నిందితులు అమ్మాయిని వివాహం చేసుకోవాలని కోరారు. అయితే ఆమె న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించింది. మేజిస్ట్రేట్ సమక్షంలో నిర్వహించిన ఐడెంటిఫికేషన్ పరేడ్‌లో, బాలిక నిందితులను స్పష్టంగా గుర్తించింది. కోర్టులో పలుమార్లు నిందితుల తరపు న్యాయవాదులు క్రాస్ ఎక్జామినేషన్ చేసినా బాలిక ధైర్యంగా నిలబడిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. కోర్టు బాలికకు రూ.7 లక్షల పరిహారం మంజూరు చేసింది. అయితే, బాలికను ఈ ప్రమాదంలోకి లాగిన స్నేహితురాలు ఇంకా జువెనైల్ న్యాయ మండలిలో విచారణ ఎదుర్కొంటోంది. ఘటన జరిగిన సమయంలో బాధితురాలు మైనర్ గా ఉన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులకు కోర్టు కఠినమైన శిక్ష విధించింది. ఇద్దరు నిందితులకు 25 సంవత్సరాల శిక్ష విధించగా, మరో ఇద్దరికి 5 సంవత్సరాల శిక్ష విధించింది.

## బీసీ రిజర్వేషన్ 42శాతం పెంచిన తరువాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలి : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్,జనవరి28:** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే రాష్ట్రం రణరంగంగా మారుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ వ్యతిరేక చర్యలను ఇప్పటికైనా మానుకోవాలని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీరామ్ జ్ఞానేశ్వర్‌కు ఆయన నియామక పత్రం అందజేసి మాట్లాడారు. కుల గణన పూర్తయినప్పటికీ రిజర్వేషన్లు పెంచడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సర్పంచ్, ఎంపీటీస్, జడ్పీటీసీ లలో బీసీలకు 20 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని, వాటిని 42 శాతం పెంచితేనే బీసీలు రాజ కీయంగా అభివృద్ధి సాధిస్తారని అన్నారు. విద్య, ఉద్యోగ రంగాలలో కూడా బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బీసీలలోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కొక్క దానికి వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్‌బీ వేముల రామకృష్ణ, జిల్లపల్లి అంజి, నంద గోపాల్, మట్ట జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101